

పండిద్దాం పొగాకు..

చెన్నూరు మండలంలో కొందరు రైతులు పంట మార్పిడి విధానంతో లాభాలు గడిస్తున్నారు. మిర్చి, పత్తి పంటలకు బదులుగా పొగాకు సాగు చేస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:22	సోమ : 5:07

గరిష్ఠం/కనిష్ఠం

39.6 /24.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అర్ధరాత్రి వరకు వేడి సెగలు కొనసాగుతాయి. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యేతోపాటు 14 మందిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతోపాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సబ్బని అరుణ్, ఎండీ. అలీ, తాళ్లపల్లి మల్లయ్య, కాంపల్లి రాజం, మద్దెల గోపి, గోగర్ల సత్యనారాయణ, ధర్మేందర్, రంగ మహేశ్, దాగం చరణ్, సందీప్, పైడిమల్ల చంద్రశేఖర్, ఖలీం, శ్రావణ్, సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు..

దండేపల్లి: మాజీ సీఎం కేసీఆర్‌ను కించపరిచేలా మాట్లాడారాంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు దండేపల్లి పోలీస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అనిల్, రాజమల్లు, శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేస్తున్న హౌస్ డిస్మెటలింగ్ కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, ప్రేంకుమార్, సంపత్ డిమాండ్ చేశారు. అతని వద్ద పని చేసే అన్ స్కిల్డ్ కాంట్రాక్టు కార్మికులకు రోజుకు రూ.526 ఇవ్వాల్సి ఉండగా రూ.440 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇతర సమస్యలపై కార్మికులు ఈనెల 8న జీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో కక్షగట్టి సదరు కాంట్రాక్టర్ కార్మికులను విధుల్లోకి తీసుకోవడం లేదని తెలిపారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే సదరు కాంట్రాక్టర్‌పై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సీవోఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విజయ్‌సాగర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఆకిడి విజయ్‌సాగర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగిన దూట శ్రీధర్ టీజీ పీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించడంతో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజయ్‌సాగర్‌కు బాధ్యతలను అప్పగించారు.

పోస్టర్ విడుదల

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రపంచ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో పబ్లిక్ అవగాహన పోస్టర్‌ను ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పౌరుడు వినియోగదారుడే అని, వారిహక్కులను కాపాడేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రతీ వ్యాపారికి, వినియోగదారులకు అవగాహన కల్పించడమే సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్ర సంస్థ ప్రతినిధులు దుర్గం ప్రవీణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఏలువాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేశం



కొత్త అధ్యక్షులను సత్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు పడాల రామన్న అనివార్య కారణాలతో వైదొలగడంతో శనివారం నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. చింతల మల్లేశం జిల్లా అధ్యక్షుడిగా, ఏదునూరి రమేష్ పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దపల్లి సూరన్న తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నియామక ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు, ఎలక్ట్రీషియన్, పెయింటర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూర్యుడు

- పెరిగిన ఎండ తీవ్రత
- రాబోయే రెండు రోజులు మరింత పెరిగే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం



జిల్లాలో ఐదు రోజులుగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
11	38.8	22.8
12	39.2	23.3
13	39.4	24.0
14	40.4	20.3
15	39.6	24.4

జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

మంచిర్యాలటౌన్: భానుడు భగ్గుమంటున్నాడు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గుతోంది. దీంతో వేడి తీవ్రత పెరుగుతోంది. మార్చి రెండో వారంలోనే జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా నమోదవుతున్నాయి. సాధారణం కన్నా నలుగైదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం వరకు ఎండ వేడి పెరగడంతో అత్యవసర పనులు ఉన్నవారు మాత్రమే బయటకు వస్తున్నారు. తలకు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలను తీసుకున్నా, పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాబోయే రెండు రోజులు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ వేడిని తట్టుకునే శక్తి తక్కువగా ఉంటుంది. వేసవిలో వచ్చే జలుబు, పలు రకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు



ఎండ వేడికి తలకు చున్నీ కట్టుకున్న యువతి

పెరిగిన ఉష్ణోగ్రతలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సరఫరా చేశారు.

వడదెబ్బతో జాగ్రత్త..

ఎండలు పెరగడంతో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేని స్థితికి చేరితే, శరీరంలోని ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటి శాతం తగ్గి(డీహైడ్రేషన్) సత్తువలేని స్థితికి చేరటం వల్ల వడదెబ్బ వస్తుంది. దీంతో గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడడం, చర్మం ఎర్రగా మారటం, వామిటింగ్ సూచనలు ఉండటం, వాంతి చేసుకోవడం, మూర్ఛ రావడం, తలనొప్పి, కోమాలోకి వెళ్లడం వంటి లక్షణాలు వడదెబ్బలో కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వడదెబ్బ సోకిన వారికి వైద్యుల సలహాతో మందులను వాడడం, రోజుకు 10 నుంచి 15 గ్లాసుల నీరు తాగాలంటున్నారు. పండ్లు, నిమ్మ రసం, మజ్జిగ, కొబ్బరి నీరు, చెరుకు రసం ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. తెల్లరంగు బట్టలు ధరించడం, బయటకు ఎండలో వెళ్లేవారు గొడుగు వాడటం, నల్ల కళ్లద్దాలు ధరించి, మసాలాలు, కారం, నూనెలు, ఫాస్ట్‌ఫుడ్, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలి.

చిన్నారులు జాగ్రత్తగా ఉండాలి

వేసవి కాలం ప్రారంభం కావడంతో చిన్నారులను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో వెళ్లకుండా చూడాలి. కాటన్ దుస్తులు ధరించేలా చూడాలి. ఎండకు వెళితే తలకు రుమాలు కట్టుకుని, టోపీ పెట్టుకోవాలి. శరీర ఉష్ణోగ్రత పెరిగి జ్వరం రావడం, వాంతులు, విరేచనాలతో శరీరం శక్తిని కోల్పోతుంది. అత్యవసరం అనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి. వేడి కారణంగా చెమట శరీరం నుంచి వెళ్లడంతో సోడియం, పొటాషియం, ఎలక్ట్రోపౌడర్ లేదా ఉప్పు, చెక్కర కలిపిన నీటిని బాగా తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎక్కడపడితే అక్కడి నీరు తాగడం వల్ల, అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తినడం, ఐస్‌క్రీంలు, కుల్ఫీలు కలుషిత నీటితో తయారు చేసే అవకాశం ఉన్నందున వాటిని పిల్లలకు తినిపించక పోవడమే మంచిది.

వృద్ధుల్లో సమస్యలు

వృద్ధుల్లో దీర్ఘకాలిక వ్యాధుల ప్రభావంతోపాటు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఎండ వేడిని తట్టుకోలేరు. శరీరం డీహైడ్రేషన్‌కు గురైతే దీర్ఘకాలిక వ్యాధులపై మరింత ప్రభావం చూపేందుకు అవకాశం ఉంది. వేడిని తట్టుకునేందుకు శరీరానికి తగినంత నీరు అవసరం కాబట్టి, నీరు బాగా తాగడంతోపాటు, కొబ్బరి బోండాం, మజ్జిగ, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలి. ఇంట్లో ఉండే గదిని చల్లగా ఉంచేలా చూడాలి. సౌకర్యంగా ఉండే కాటన్ దుస్తులను ధరించి, శరీర ఉష్ణోగ్రతలు పెరిగితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వృద్ధుల్లో వేడిని తట్టుకునే స్థాయి తక్కువ కావడం వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. చెమట అధికంగా రావడంతో అలసటకు గురై, అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.

మందులు సిద్ధంగా ఉంచాం



ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండకు వెళ్లక పోవడం మంచిది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, సబ్ సెంటర్లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సరిపడా అందుబాటులో ఉంచాం. సెలైన్ బాటిళ్లతోపాటు, అత్యవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఆస్పత్రులతోపాటు, పనిప్రదేశాల్లోనూ అందుబాటులో ఉండేలా చర్యలను తీసుకున్నాం.

– డాక్టర్ హరీశ్‌రాజ్,
జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

ఆడబిడ్డకు అండగా ఉంటాం

- చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆడబిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని పద్మావతి గార్డెన్స్‌లో నియోజకవర్గంలోని హాజీపూర్, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాలతోపాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి కింద రూ.41.15 లక్షలను 132 మందికి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.2,76,32,016లను 276 మంది లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోహన్‌కు సేవారత్న అవార్డు



పురస్కారం అందుకుంటున్న మోహన్

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు గజ్జెల్లి మోహన్‌ను సేవారత్న అవార్డు, జాతీయ ఉగాది పురస్కారం వరించింది. హైదరాబాద్ తార అకాడమీ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రవీంద్ర భారతిలో భారతీయ సంప్రదాయ సాంస్కృతిక కళోత్సవంలో భాగంగా జాతీయ ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మోహన్‌కు సేవారత్న అవార్డు, జాతీయ ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సుమన్, ఐఏఎస్ అధికారి పరికి పండ్ల నరహరి, ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి, వకుళాభరణం కృష్ణమోహన్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తార ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు సంకె రాజేశ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్, పలువురు రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

నేతన్నలకు రుణమాఫీ



రుణమాఫీ వర్తించనున్న చెన్నూర్ చేనేత సహకార పరిశ్రమ కార్మికులు

- జిల్లాలో 48 మంది కార్మికులకు మేలు

చెన్నూర్: ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూతనందిస్తోంది. నిన్న మొన్న నేతన్నలకు భరోసా, బీమా పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం తాజాగా రూ.లక్ష రుణమాఫీ ప్రకటించింది. దీంతో కార్మికులకు మేలు చేకూరనుంది. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించడంతో జిల్లాలోని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో చెన్నూర్ చేనేత సహకార పరిశ్రమలో పని చేస్తున్న 48 మంది కార్మికులకు లబ్ధిచేకూరుంది.

ఆదరణ తగ్గుతున్న సమయంలో

రెడీమేడ్ రంగ ప్రవేశంతో రోజురోజుకూ చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గుతోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఏడు సొసైటీలు అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. కొన్ని మూత పడ్డాయి. ప్రస్తుతం చెన్నూర్‌లోని చేనేత సహకార పరిశ్రమ 130 మంది కార్మికులతో నడుస్తుంది. చేనేత బట్టకు డిమాండ్ లేక పోవడంతో కార్మికులకు రోజువారీ కూలి గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. డిమాండ్ ఆధారంగా వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో ఒక్కో కార్మికునికి రోజుకు రూ.400 నుంచి రూ.500 కూలి గిట్టుబాటు అవుతుంది. దీంతో కుటుంబ పోషణ భారం కావడంతో కార్మికులు బ్యాంక్‌లలో రుణాలు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. కష్టాలలో ఉన్న కార్మికులకు ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేయడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


జాబితా పంపించాం..



చేనేత సొసైటీలో పని చేస్తున్న 48 మంది కార్మికులు రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లక్ష రుణమాఫీకి అర్హత ఉన్న 48 మంది కార్మికుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. వీరి రుణాలు మాఫీ అవుతాయి. కష్టకాలంలో ఊరటనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

– బల్ల శశిధర్, సొసైటీ కార్యదర్శి చెన్నూర్


సంతోషమే...



వారానికి రూ.2 వేల పని చేస్తున్నా.. పని చేసే ఓపిక ఉన్నా బట్టలకు డిమాండ్ లేక రోజు అంతంత పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇంటి అవసరాల కోసం రూ.లక్ష అప్పు తీసుకున్నా. కొంత కట్టినా. ఇంకో రూ.30 వేల అప్పు ఉంది. ప్రభుత్వం లక్ష రుణమాఫీ చేసింది. నా అప్పు మాఫీ అవడం సంతోషంగా ఉంది. పని తక్కువ ఉన్న సమయంలో ప్రభుత్వం రుణం మాఫీ చేసి మమ్ముల్ని ఆదుకుంది.

– అయిదపు లక్ష్మయ్య, కార్మికుడు

కష్ట సమయంలో ఆదుకుంది..



కష్టాల్లో ఉన్నాం. కష్ట సమయంలో ప్రభుత్వం అప్పు మాఫీ చేస్తామని ప్రకటించి మాకు ఊపిరి పోసింది. రూ.50 వేల అప్పు తీసుకున్నా. ఇప్పటి వరకు రూ.15 వేల అప్పు కట్టిన. మరో రూ.35 వేల అప్పు ఉంది. అప్పు ఎలా కట్టాలని ఇబ్బంది పడ్డా. లక్ష రుణమాఫీతో నా అప్పు తీరిపోతుంది. కష్టాల్లో ఉన్న కార్మికులకు ప్రభుత్వం మేలు చేసింది.

– కుకట్ల కిష్టయ్య, కార్మికుడు. చెన్నూర్

ఏఐ బోధనను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్/లక్సెట్టిపేట/జన్నారం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా అందిస్తున్న విద్యా బోధనను ఎఫ్‌ఎల్‌ఎన్‌లో వెనుకబడిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. జైపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఏఐ ల్యాబ్(ఎఫ్‌ఎల్‌ఎన్-ఏఏఎల్-ఏఐ)లను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి శనివారం ప్రారంభించారు. జన్నారం మండలం మురిమడుగు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఎంఈవో విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏక్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలో తొలి విడతగా ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేసిందని తెలిపారు. వచ్చే వారంలో మరికొన్ని పాఠశాలల్లో ల్యాబ్‌లు ప్రారంభిస్తామన్నారు. ఏఐ ల్యాబ్ ద్వారా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులు వారికివారే నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. స్వీయ ప్రేరణ ద్వారా అభ్యసన అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతిలోనే కృతిమ మేధ ద్వారా బోధన అభ్యాసన చేయడం గొప్ప విషయమన్నారు. కృత్రిమ మేధ విద్యారంగంలో విప్లవాత్మకమైన ఆలోచన అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయాలని సూచించారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని తెలిపారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మాట్లాడుతు ప్రతీ విద్యార్థికి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలన్నారు. ఇందుకు ప్రభుత్వం సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాలల ఆవరణ, వంట శాలలు, తరగతి గదులను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలన్నారు. కార్యక్రమాల్లో సమగ్ర శిక్షణ సమన్వయకర్త చౌదరి సత్యనారాయణమూర్తి, డీఈవో యాదయ్య, మాస్టర్ ట్రెనర్ శ్రీధర్‌రెడ్డి, ఎంఈవోలు శ్రీనివాస్, హెలెన్ డొరతి, హెచ్‌ఎంలు శ్యాంసుందర్, ప్రేమల, అజయ్‌కుమార్, శుభాష్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, కంప్యూటర్ ఉపాధ్యాయుడు రాజేందర్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అజయ్‌కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శుభాష్, ఎమ్మార్పీ శివ తదితరులు పాల్గొన్నారు.



ఏఐ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలోని ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం పరీక్ష కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

వినియోగదారుడు హక్కులు తెలుసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వినియోగదారుడు తన హక్కుల గురించి తెలుసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి పెట్రోలియం సంస్థలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలు చేసినప్పుడు మోసపోతే పోర్టల్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉందని తెలిపారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీల విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తినా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారం నాణ్యతగా లేకపోయినా, సరైన ఆహారం అందించకపోయినా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆస్పత్రిలో వైద్య సేవలు అందించకపోయినా, వైద్యులు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందుల షాపులో ఇవ్వకపోయినా మెడికల్ బోర్డు/డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. కాలపరిమితి ముగిసిన వాటిని విక్రయిస్తే కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్‌తో కలిసి వినియోగదారుల హక్కుల సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పూడిక తీయించండి

- నీల్వాయి ప్రాజెక్టు ఎడమ ఆయకట్టు రైతుల ఆందోళన

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పూడికతో నిండడంతో చివరి ఆయకట్టుకు నీళ్లు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొర్లపల్లి గ్రామం వద్ద పూడికతో నిండి ఉన్న కాలువ వద్ద శనివారం ఆందోళన చేశారు. రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇరువైపులా ఉన్న మట్టితో కాలువలో పూడిక పేరుకుపోయిందని తెలిపారు. మీటర్ నర లోతు మట్టి ఉండటంతో నీళ్లు దిగువకు వెళ్లడం లేదని పేర్కొన్నారు. దీంతో గొర్లపల్లి, దస్నాపూర్, కొత్తపల్లి, వేమనపల్లి శివారు పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్నాయన్నారు. సుమారు 100 ఎకరాలకు నీరు అందడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి కాలువ వెంట ఉన్న పూడికతోపాటు తుంగ, పిచ్చి మొక్కలను తొలగించి పొలాలకు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ వెంకటస్వామికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా తన దృష్టికి రాలేదని, రెండు రోజుల్లో పూడిక తీయించి పొలాలకు నీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



పూడికతో నిండిన కాలువను చూపిస్తున్న రైతులు


బ్లాక్ వెంజెడ్ స్టిల్ట్


నైట్ జార్


గ్రీన్ బీ ఈటర్


వైట్ ఐ బజార్డ్

కవ్వాల్.. విహంగాల విడిది

జన్నారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ వన్యప్రాణులకే కాకుండా పక్షులకు ఆవాసంగా మారింది. స్థానిక పక్షులకే కాకుండా విదేశీ పక్షులు కూడా ఇక్కడికి వస్తున్నాయి. జన్నారం అటవి డివిజన్‌లోని మైసమ్మకుంట, బైసన్‌కుంట, కల్పకుంట, ఘనిషెట్టికుంట ప్రాంతాలు పక్షులకు ఆవాసంగా మారాయి. విదేశీ పక్షులైన లెజర్ విజ్లింగ్ డక్స్, ఆసియన్ ఓపెన్ బిల్‌స్టోక్, ఇండియన్ స్పాట్ బిల్డ్ డక్, హర్న్ బిల్‌తోపాటుగా ఇండియన్ పక్షులు ఇక్కడికి వస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన బర్డ్‌వాక్, పక్షుల సర్వేతో పక్షులపై ఈ ప్రాంత వాసులకు మక్కువ పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పక్షుల ఆవాసాలను మరింత అభివృద్ధి చేస్తామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

క్లుప్తంగా

జీవో 3ను పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సచిన్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం జీవో 3ను పునరుద్ధరించి ఆదివాసీలకు ఉద్యోగాలు దక్కేలా చూడాలని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. బెంగుళూర్‌లో నిర్వహిస్తున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో ఆయన రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొని మాట్లాడారు. జీవో 3ను పునరుద్ధరణ చేసే అధికారం, అవకాశం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. అయితే ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా కేంద్రం స్పందించి 5వ షెడ్యూల్‌లో ఆదివాసీ యువతకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గంజాయి కేసులో మహిళ రిమాండ్

దండేపల్లి: లక్సెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండల కేంద్రంలో పసుపునూటి సత్యవతి అనే మహిళ ఇంట్లో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. 90 గ్రాముల గంజాయి లభించిందని లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. ఈమేరకు గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై మౌనిక, సిబ్బంది వెంకటేశ్, శిరీష పాల్గొన్నారు.

పండిద్దాం పొగాకు..

- చెన్నూర్ చేలల్లో సాగు..
- పంట మార్పిడికి ముందుకు వస్తున్న రైతులు
- తక్కువ నీటి వసతి ఎక్కువ దిగుబడి
- పంటను ఆశించని తెగుళ్లు


శివలింగాపూర్ సమీపంలో తోరణాలుగా ఆరబెట్టిన పొగాకు


అక్కెపల్లి సమీపంలో సాగవుతున్న పొగాకు పంట

చెన్నూర్‌రూరల్: ఎప్పుడూ ఒకే రకం పంటల సాగుతో భూమిలో సారం దెబ్బతింటుంది. పంట మార్పిడి విధానం పాటించాలని వ్యవసాయాధికారులు కూడా తరచూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు దీనిని పట్టించుకోరు. కానీ, చెన్నూరు మండలంలో కొందరు రైతులు అధికారుల సూచనలతో పంట మార్పిడి విధానంతో లాభాలు గడిస్తున్నారు. మిర్చి పంట సాగు చేసి పురుగు ఆశించడం, సరైన దిగుబడి రాకపోవడం, మద్దతు ధర లేకపోవడంతో విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కొందరు మిర్చి పంటకు బదులుగా పొగాకు సాగుచేస్తున్నారు. ఈ పంటకు తక్కువ నీరు, తెగుళ్ల బెడద లేకపోవడంతో సాగుకు చాలా మంది ముందుకు వస్తున్నారు. చెన్నూర్ మండలంలో గతేడాది కేవలం రెండెకరాల్లో పొగాకు సాగు కాగా, ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 20 ఎకరాల వరకు సాగు చేశారు. చెన్నూర్ మండలం అక్కెపల్లి, శివలింగాపూర్‌లో మాత్రమే సాగవుతుంది. మిర్చి, పత్తి పంట పెట్టుబడి తరహాలోనే పొగాకు పంటకు పెట్టుబడి అవుతుందని, లాభాలు మాత్రం ఎక్కువగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

చీడ, పీడలు, తక్కువే..

పొగాకు పంటలో కలుపు, తెగుళ్ల బెడద ఉండదు. ఒక లద్దె పురుగు, తేనె మంచు మాత్రమే ఆశిస్తుంది. దీని నివారణకు లామ్డాసైహలోత్రిన్, ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరాకు 120 ఎంఎల్ పిచికారీ చేస్తే సరిపోతుంది. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 60 ఎంఎల్ పిచికారీ చేయాలి. ఈ పంటకు కోతులు, అడవి పందులు, పశువుల బెడద ఉండదు.

ఆరబెట్టే విధానం..

పంట వేసిన ఐదు నెలలకు దిగుబడి చేతికి వస్తుంది. ఆకులను తెంపి సోలార్ కవర్ ఉన్నట్లయితే 8 నుంచి 10 రోజులు ఆరబెడితే సరిపోతుంది. లేదంటే తోరణాలుగా తయారు చేసి 20 రోజుల నుంచి 25 రోజులు ఆరబెట్టాలి. మార్కెట్‌కు తీసుకువెళ్లే సమయంలో బేల్లుగా తయారు చేసి తేమశాతం లేకుండా చూసుకోవాలి. క్వింటాల్ ధర రూ.15 వేల వరకు వస్తుంది. జనగామ జిల్లా ములకనూరులో పొగాకు మార్కెటింగ్ సౌకర్యం ఉన్నప్పటికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఆంధ్రకు వెళ్లాల్సి వస్తుంది. రైతులు ఒకే రకం పంట సాగు చేయకుండా ఇలా పంట మార్పిడి చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

సాగు విధానం

పొగాకు ఐదు నెలల పంట. ఆగస్టు, సెప్టెంబర్‌లో సాగుచేయాలి. ఇక్కడి రైతులకు నారు ఆలస్యంగా రావడంతో నవంబర్‌లో మొక్కలు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కొత్తూరులోని జీపీఏ కంపెనీ వారు నారును అందించారు. ఒక్కో మొక్కకు రూ.1 చొప్పున పడుతుంది. ఎకరాకు 10 వేల మొక్కలు నాటుతారు. జీపీఏ కంపెనీ వారే పండిన పంటను కొనుగోలు చేస్తారు. ఇక్కడ సాగు చేసే పొగాకు రకం వైట్‌బెర్లీ రకం. ఎకరాకు రూ.70 వేలు ఖర్చవుతుంది. మొక్కలు నాటుపెట్టే సమయంలో ఆఖరి దుబ్బులో 15 కిలోల యూరియా, ఒక డీఏపీ 50 కిలోల బస్తా వేస్తారు. నాటు పెట్టి ఆకులు వచ్చే సమయంలో 20 రోజులకు 50 కిలోల పొటాష్‌ని వేస్తారు. నీటితడులు మూడుసార్లు అందిస్తారు. 25 రోజుల్లో అందించాల్సి ఉంటుంది. నాటు పెట్టిన 50 రోజుల్లో అమ్మోనియా వేస్తారు. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

రైతులు ముందుకు రావాలి



పంట మార్పిడిని అవలంబించేందుకు రైతులు ముందుకు రావాలి. అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎలాంటి తెగుళ్లు ఆశించవు. పశువులు, అడవిపందులు, కోతుల బెడద ఉండదు. నీటి తడులు కూడా తక్కువగా ఉంటాయి. రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– యామిని, ఏవో, చెన్నూర్

పంట మార్పిడి చేయాలి



ఎప్పటికీ ఒకే రకం పంటలు కాకుండా పంట మార్పిడి చేస్తే భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. మా క్లస్టర్‌లో కొందరు రైతులు పొగాకు సాగు చేశారు. పంట దిగుబడి కూడా బాగానే వస్తుంది. రైతులు ఆలోచించాలి.

– రాజశేఖర్, ఏఈవో, అక్కెపల్లి, క్లస్టర్

ఆరెకరాల్లో సాగుచేశా



మిర్చి, పత్తి సాగు చేస్తే పురుగు, తెగుళ్లు ఆశిస్తే దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తుంది. గతేడాది రెండెకరాల్లో పొగాకు సాగు చేశాను. మంచి లాభం వచ్చింది. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో సాగు చేశాను.

– హన్మంతరావు, రైతు, శివలింగాపూర్

దిగుబడి చేతికి వస్తోంది



కొన్నేళ్లుగా పత్తి, మిర్చి, వరి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది పంట మార్పిడి చేయాలని అనుకున్నా. మరో రైతును అడిగితే పొగాకు వేయాలని సూచించాడు. రెండెకరాల్లో సాగు చేశాను. పంట ఇప్పుడే చేతికి వస్తుంది.

– బజ్జూరి లచ్చన్న, రైతు, అక్కెపల్లి

తండ్రిపై దాడికి సుపారీ..

- స్నేహితుడికి రూ.50 వేలు ఇచ్చిన కొడుకు
- దాడిచేసి గొలుసు ఎత్తుకెళ్లిన దుండగులు
- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్, ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తండ్రి, కొడుకు మధ్య కొన్ని రోజులుగా తలెత్తిన గొడవ చివరకు దాడి దారితీసింది. తండ్రి గొడవతో విసిగిపోయిన కొడుకు దాడి చేయించేందుకు స్నేహితుడికి సుపారీ ఇచ్చాడు. సుపారీ తీసుకున్న స్నేహితుడు దుండగులతో దాడి చేయించడంతోపాటు బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు. మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్ హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. వేంపల్లికి చెందిన నాగిరెడ్డి సత్యానందం-సరస్వతి దంపతులకు కొడుకు రమేశ్ ఉన్నాడు. దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా తండ్రి, కొడుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రమేశ్ తండ్రిపై దాడి చేయించేందుక అతని స్నేహితుడు సొల్లు అవినాశ్‌కు రూ.50 వేల సుపారీ ఇచ్చాడు. దీంతో అవినాష్ గర్మిళ్లకు చెందిన అందె అశోక్, అట్ల సంతోష్, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందు, చింతల కృష్ణతో కలిసి దాడికి ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సత్యానందర్ ఇంట్లో ఉండగా దాడి చేయించాడు. అంతేకాకుండా అతని మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. దీంతో బాధితుడు సాయంత్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు.

కొడుకుపై అనుమానంతో..

ఈ క్రమంలో కొడుకుపై అనుమానం రావడంతో అతడిని విచారణ చేశారు. దీంతో జరిగిన విషయం చెప్పాడు. దీంతో పోలీసులు అవినాశ్‌తోపాటు అశోక్, సంతోష్, చందు, కృష్ణను కూడా అదుపులోకి తీసుకున్నారు. 24 గంటల్లో దాడి కేసును ఛేదించారు. అయితే విచారణలో రమేశ్ చెప్పిన విషయాలు విని పోలీసులు షాక్‌కు గురయ్యారు. కేవలం కుటుంబ కలహాలతో కన్న తండ్రిపైనే దాడికి సుపారి ఇచ్చినట్లు రమేశ్ పోలీసులకు తెలిపాడు. నిందితుల నుంచి తులం బంగారు గొలుసు, సుపారీ కింద ఇచ్చిన రూ.30,670 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో కేసు ఛేదించిన మంచిర్యాల రూరల్ సీఐ ఆశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్, సీసీసీ ఎస్సై సుగుణాకర్, ఏఎస్సై ఎజాజ్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, నరేందర్, ఎస్కే.పాషాను సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

మత్తడి ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గున్నికుంట చెరువు మత్తడి ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. ఈనెల 11న చాకేపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య గున్నికుంట చెరువు పక్కన ఉన్న తన చేనులో చెరువు భూమి కబ్జా చేసుకున్నాడు. తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌కు చెందిన జేసీబీ సహాయంతో తన భూమిలో తుమ్మ చెట్లను తొలగించాలని సూచించిన రాజయ్య అనంతరం గున్నికుంట చెరువు మత్తడి, తూము, కట్టను ధ్వంసం చేస్తే అధిక డబ్బులు ఇస్తానని చెప్పాడు. దీంతో విష్ణువర్ధన్ చెరువు మత్తడి, తూము, కట్టను ధ్వంసం చేసి ఆ మట్టిని చెరువులో వేసి చెరువు భూమిని రాజయ్య భూమిలో కలిపాడు. దీంతో చెరువు భూమి కబ్జాపై ఇరిగేషన్ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న ఇరిగేషన్ ఏఈఈ సునీత భూమి కబ్జా అయినట్లు గుర్తించి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రమేశ్ నిందితులు దుర్గం రాజయ్య, విష్ణువర్ధన్‌ను శనివారం అదుపులోకి తీసుకుని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజపర్చామని సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామ శివారులోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్పీ రాజేశ్‌మీనా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. పేకాడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.10,1000 నగదు, 18 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలు, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులున్నట్లు సమాచారం.

డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిపై కేసు

బెల్లంపల్లి: ఎలక్ట్రానిక్ మీడియా ముసుగులో ఓ ప్రైవేట్ వైద్యుడిని డబ్బులు అడిగి, ఆస్పత్రి యజమానితో గొడవకు దిగిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. స్థానిక బజారు ఏరియా కృష్ణమందిర్ వీధిలో ఉన్న నిత్య పిల్లల ఆస్పత్రికి నవాబ్, శంషాద్ అహ్మద్, మరో వ్యక్తి శుక్రవారం కలిసి వెళ్లారు. తాము ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులమని చెప్పి ఆస్పత్రి వైద్యుడిని డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బుల వ్యవహారం తనకు సంబంధం లేదని, ఆస్పత్రి యాజమాన్యాన్ని కలవాలని తెలిపాడు. దీంతో సదరు వ్యక్తులు ఆస్పత్రి యాజమాని కొమురవెల్లి సంతోష్‌ను కలిసి రూ.10 వేలు డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని సంతోష్ చెప్పాడు. దీంతో ఆ ముగ్గురు సంతోష్‌తో గొడవకు దిగారు. దీంతో బాధితుడు అదేరోజు రాత్రి వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఉదయం స్థానిక సంజయ్‌నగర్ సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న రేవంత్, నీలకంఠతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాస్, ఆయన భార్యకు గాయాలయ్యాయి. సంజయ్‌నగర్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న యువకులు ఎదురుగా ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: మద్యం మత్తులో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బుర్సన్‌పటర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లే విద్యాసాగర్(57) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం హోలీ సంబరాల్లో భాగంగా అతిగా మద్యం తాగాడు. అదే మత్తులో సాయంత్రం చేనుకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించి 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధి మొర్రిగూడెం గ్రామానికి చెందిన ఆకుల సత్తెన్న (42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం వివాహమైన సత్తెన్నకు సంతానం కలగకపోవడం, రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మరణించడంతో మద్యానికి బానిసయ్యాడు. ఒంటరిజీవితం గడుపుతున్న అతడు మనస్తాపంతో గతంలో పలుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈక్రమంలో ఈనెల 14న మద్యం సేవించి బాత్‌రూంలో టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు ఆకుల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.